# అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌వన్



సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, నాయకులు

- ప్రజలు అభివృద్ధిలో నాటి, నేటికి తేడాను గమనించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- బీర్‌పూర్ మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

సారంగాపూర్, అక్టోబర్ 8: దేశంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలుస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో రూ. 20 లక్షల నిధులతో చేపట్టే పైపులైన్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి నూతనంగా నిర్మించిన ఎంఆర్‌సీ భవనాన్ని ప్రారంభించారు. తుంగూర్ గ్రామం నుంచి దొంతాపూర్‌కు రూ.1.80 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. తుంగూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కమ్మునూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించే పంచాయతీ కార్యాలయ భవనానికి భూమి పూజ చేశారు. మంగెళ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ఎలా ఉంది..? తెలంగాణ రాక ముందు అభివృద్ధి ఎలా ఉందో..? ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి జనాభా ప్రతిపాదికన నిధులు మంజూరు చేస్తున్నదని చెప్పారు. ఆడబిడ్డ పెండ్లికి దేశంలో ఏ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం చేయడం లేదని, కేవలం తెలంగాణలో మాత్రమే కల్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ.లక్షా నూట పదహార్లు అందిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడా లేని విధంగా జీతాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల బాగుకోసం నిరంతరం శ్రమిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మసర్తి రమేశ్, జడ్పీటీసీ పాత పద్మ-రమేశ్, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, జిల్లా రైతు బంధు సమితి కన్వీనర్ కొల్ముల రమణ, మండల కన్వీనర్ మేరుగు రాజేశం, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారపాక రమేశ్, ప్రధాన కార్యదర్శి శీలం రమేశ్, ఉపాధ్యక్షులు రామకిష్టు గంగాధర్, శ్రీనివాస్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు గాజర్ల రాంచంద్రం గౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నల్ల మైపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు గర్షకుర్తి శిల్ప, రిక్కల ప్రభాకర్, ఎడ్ల సృజన, గుడిసె శ్రీమతి జితేందర్ యాదవ్, మెసు ఏసుదాసు, ఎలగందుల లక్ష్మి, బందెల మరియా, చిక్రమ్ సుగుణ, నారపాక రమ, పర్వతం రమేశ్, అజ్మీరా ప్రభాకర్, చుంచు శారద, మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్, ముక్క వెంకటేశ్ యాదవ్, దూలూరి వంశీ, హరీశ్, కృష్ణారావు, ఆయా గ్రామాల నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం

జగిత్యాల, అక్టోబర్ 8: జిల్లా కేంద్రంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన ప్రెస్‌క్లబ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతను జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

## పోచమ్మ దేవాలయంలో అన్నదానం

### పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, అక్టోబర్ 8: జిల్లా కేంద్రంలోని పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఒడిబియ్యం కార్యక్రమం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ పాలకవర్గ సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ బొడ్ల జగదీశ్, నాయకులు లైశెట్టి వెంకన్న, వొల్లెం మల్లేశం, ఆలయ పాలక మండలి సభ్యులు, మహిళలు,భక్తులు పాల్గొన్నారు.

## చెత్త బుట్టల పంపిణీ

కొడిమ్యాల(మల్యాల), అక్టోబర్ 8: మల్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రామస్తులకు 1000 చెత్తబుట్టలు (డస్ట్ బీన్ల)ను సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో మొత్తం 3 వేల చెత్త బుట్టలు పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి రోజు 1000 పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో వాసవి, ఈవో పరమేశ్వర్, వార్డు సభ్యులు పోచంపల్లి నీల, కొరెపు వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుదర్శన్

## కంటతడి పెట్టే నాయకులను నమ్మవద్దు

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- తక్కళ్లపల్లి నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకుల చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల(మల్యాల), అక్టోబర్ 10: ఎన్నికల ముందు గ్రామాలకు వచ్చి కంటతడి పెట్టే నాయకుల మాటలు నమ్మవద్దని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ముప్పారపు రామస్వామితోపాటు కాంగ్రెస్, బీజేపీకి చెందిన 60 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు వచ్చి నాయకులు ఆ తర్వాత కనిపించరన్నారు. అభివృద్ధి చేసే నాయకులను గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, తక్కళ్లపల్లి సర్పంచ్ గొడుగు కొమరస్వామి, పొన్నం మల్లేశంగౌడ్, మారంపెల్లి నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ పులి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి

రామడుగు, అక్టోబర్ 8: గంగాధర మండలం బూరుగుపల్లిలోని నివాసంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆదివారం మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన గ్రీన్ స్టార్స్ యువజన సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ, గ్రామంలో యూత్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం ఉందని, నిధులు మంజూరు చేస్తే భవన నిర్మాణం చేసుకుంటామని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.




ఎమ్మెల్యే రవిశంకర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బుచ్చిరెడ్డి

కార్పొరేషన్, అక్టోబర్ 8: కరీంనగర్‌లోని 35వ డివిజన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం కార్మికులకు దసరా పండుగకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య జవాన్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లిలో ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

చిగురుమామిడి, అక్టోబర్ 8: చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కర్నె రాజయ్య (60) ట్రాక్టర్ ఢీకొని మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. రాజయ్య ఆదివారం సాయంత్రం సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ పంచాయతీ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. టైరు తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎక్స్‌కవేటర్ల దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కరుణాకర్‌రావు

రాంనగర్, అక్టోబర్ 8: కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్, తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ, కొత్తపల్లి గ్రామాల్లో ఎక్స్‌కవేటర్లు చోరీ చేసిన దొంగల ముఠా పోలీసులకు చిక్కింది. నిందితులను రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ కరుణాకర్ రావు మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గోపాల్‌పూర్‌కు చెందిన రామకృష్ణ ఎక్స్‌కవేటర్లు కొనుగోలు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందేవాడు. పని లేని సమయంలో ఎక్స్‌కవేటర్‌ను పొలం వద్ద పెట్టి ఉంచేవాడు. గత నెల 13న పార్క్ చేసిన ఎక్స్‌కవేటర్ ఉదయం చూసేసరికి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తిరిగి కొద్ది రోజులకే తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీకి చెందిన గోపాల్ ఎక్స్‌కవేటర్‌ను గత నెల 30న ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశాడు. తెల్లారేసరికి కనిపించకుండా పోయింది. ఈ రెండు ఘటనలపై ఆధారాలు ఒకే తరహాలో ఉండడంతో రూరల్ ఏసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించగా, కొత్తపల్లిలో కూడా గత నెల 11న ఎక్స్‌కవేటర్ ఇదే తరహాలో చోరీకి గురైనట్లు గుర్తించారు. సీసీ పుటేజీలు పరిశీలించగా చోరీకి గురైన ఎక్స్‌కవేటర్లను తప్పుడు నంబర్ నమోదు చేసి టోల్ గేట్లు దాటినట్లు గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కేసు చిక్కుముడి వీడింది తీగలగుట్టపల్లి కి చెందిన గుంజె లక్ష్మణ్ గతంలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేసి బ్యాంకు లోన్‌తో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అయితే ఆశించిన గిరాకీ రాకపోవడంతో ఈఎంఐలు కట్టలేక హైదరాబాద్ కు వెళ్లి కార్ డ్రైవర్ అవతారం ఎత్తాడు. నెల నెలా డబ్బు లేకపోవడంతో తన ఎక్స్‌కవేటర్‌పై పని చేసిన ఆలకుంట ఏకాంబరంతో కలిసి ఎక్స్‌కవేటర్ల చోరీకి ప్రణాళిక రూపొందించాడు. వీరి కి గతంలో ఎక్స్‌కవేటర్ ఉన్న మురళి కూడా తోడవడంతో ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లో తనకు పరిచయం ఉన్న బెజ్జారం రమేశ్‌తో డీల్ కుదుర్చుకున్నారు ఎక్స్‌కవేటర్లను దొంగలించి వాటిని తీసుకెళ్లి రమేశ్ మధ్యవర్తిత్వం ద్వారా వికారాబాద్ కు చెందిన కోట్ల షకీల్ కు విక్రయించారు. ఇలా రెండు ఎక్స్‌కవేటర్లు విక్రయించి రూ. 7.50 లక్షలు సంపాదించారు. ఎక్స్‌కవేటర్ల చోరీ ఘటనలపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఈ వివరాల ఆధారంగా ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 17 లక్షలు ఉంటుందని ఏసీపీ కరుణాకర్ తెలిపారు నిందితులను పట్టుకోవడంతోపాటు కేసును చేదించిన రూరల్ సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ రాజు, సిబ్బంది అశోక్, రమేశ్, దయానంద్‌ను ఏసీపీ అభినందించారు.